21-10-2017 ఉదయము మురళి ఓంశాంతి బాప్‌దాదా మధువనము

**" మధురమైన పిల్లలారా - ఏ కొంచెము అజాగ్రత్తగా ఉండినా, ఈశ్వరీయ సాంగత్యము నుండి కూడా దూరమయ్యే విధంగా మాయ మిమ్ములను మింగేస్తుంది. కావున స్వయాన్ని సంభాళించుకోండి, అప్రమత్తంగా ఉండండి. "**

ప్రశ్న :- ఈశ్వరీయ క్లాసులో కూర్చునేందుకు పాటించవలసిన నియమము ఏది?

జవాబు :- తండ్రిని యథార్థముగా ఎవరైతే గుర్తించారో వారు మాత్రమే ఈ క్లాసులో కూర్చోగలరు. ఇచ్చట కూర్చునేవారికి అవ్యభిచారి స్మృతి ఉండాలి. ఇక్కడ కూర్చొని కూడా ఇతరులను స్మృతి చేస్తూ ఉంటే, వారు వాయుమండలాన్ని పాడు చేస్తారు. ఇది కూడా చాలా పెద్ద డిస్‌సర్వీసు, ఇచ్చటి నియమాలు కఠినముగా ఉన్నందున మీ వృద్ధి తక్కువగా జరుగుతుంది.

ప్రశ్న :- ఏ ఒక్క విషయము ద్వారా పిల్లల స్థితి తెలిసిపోతుంది?

సమా :- ఈ రోగగ్రస్థమైన భోగీ ప్రపంచములో ఎప్పుడూ ఏదైనా పరీక్ష వస్తే సహించలేక ఏడ్వడం మొదలుపెడ్తే వారి స్థితి తెలిసిపోతుంది. ఏడ్చుట మీకు నిషిద్ధము.

**పాట :- దర్పణములో ముఖము చూసుకో ప్రాణి!..................(ముఖ్‌డా దేఖ్‌లో ప్రాణి!............)**

ఓంశాంతి. ప్రాణి అని ఎవరన్నారు? ప్రాణి అనగా ఆత్మ, వీరి ప్రాణము పోయింది అని అంటారు కదా. అనగా ఆత్మ వెళ్లిపోయిందనే కదా. కావున ప్రాణము అని ఆత్మనే అంటారు, శరీరాన్ని కాదు. తండ్రి ఆత్మలను అడుగుతున్నారు - నీవు పాపాత్మవా లేక పుణ్యాత్మవా? అందరూ స్వయాన్ని పతితులమని ఒప్పుకుంటారు. అందువలన మేము ఏ ఏ పాపాలు చేశాము? ఎప్పుడు చేశామని స్వయాన్ని ప్రశ్నించుకోండని తండ్రి అంటున్నారు, అందరూ పాపాత్మలే కదా. అయితే నంబరువారుగా ఉండనే ఉంటారు. అయితే నంబరువారు పుణ్యాత్మలు ఎవరు? నంబర్‌వన్ పాపాత్మ ఎవరు? భారతదేశము పావనంగా ఉండేది. అదే ఇప్పుడు పతితంగా ఉంది. నేడు మనుష్యులందరూ మాయకు బానిసలై పోయారు. అర్ధకల్పము మాయకు బానిసలుగా అవుతారు. మళ్లీ మాయను బానిసగా చేసుకుంటారు. అప్పుడు వారిని పుణ్యాత్మలని అంటారు. లక్ష్మీనారాయణులను భగవాన్-భగవతి అని అంటారు. వారిప్పుడు ఎచ్చటకు వెళ్లారు? సత్యయుగములో కేవలం లక్ష్మీనారాయణులు మాత్రమే కాదు, వారి పూర్తి వంశము కూడా ఉండేది. ఆ సమయములో భారత ఖండాన్ని పావన భారతమని అనేవారు. అచ్చట దైవీగుణాలు గల మనుష్యులుండేవారు. సర్వగుణ సంపన్నులు, 16 కళా సంపూర్ణులు అని అంటారు. కనుక వారు పుణ్యాత్మలే కదా. మళ్లీ అహింసో పరమోధర్మ అని కూడా అంటారు. కనుక వారు అహింసకులుగా కూడా ఉండేవారు. హింసకు రెండు అర్థాలున్నాయి - హింస అనగా ఎవరినైనా హత్య చేయడం, కొట్టడం. హత్య కూడా రెండు విధాలు. మొదటిది కామఖడ్గముతో చంపుట, రెండవది ఎవరినైనా క్రోధముతో చంపుట. ఇది కూడా హింసయే. ఈ సమయములో అందరూ పాపాత్మలుగానే ఉన్నారు. నిర్గుణుడనైన నాలో ఏ గుణమూ లేదని కూడా అంటారు. కనుక నెంబరువారుగా ఉంటారు కదా. నెంబరువారుగా ఉండినా అందరూ పాపాత్మలే. తండ్రి వచ్చినప్పుడు తండ్రిని గుర్తించాలి.

వారిని పరమపిత అని అన్నప్పుడు వారికి తండ్రి ఎవ్వరూ లేరు. వారే అందరికీ తండ్రి, టీచరు, పరంధామములో ఉండే పరమపితకు తండ్రి ఎవ్వరూ లేరు. మిగిలిన వారందరికీ తండ్రి ఉంటారు. బ్రహ్మ, విష్ణు, శంకరులకు కూడా తండ్రి ఉన్నారు. ఓం నమ: శివాయ అని అంటారు అనగా వారు అందరికీ తండ్రి అయినట్లే కదా. ఆ తండ్రి పునర్జన్మ తీసుకోరు. కానీ వారు కల్పములో ఒక్కసారి మాత్రమే జన్మిస్తారు. శివజయంతి అని అంటారు కనుక జన్మ తీసుకున్నారు కదా. శివుడు ఎలా జన్మ తీసుకుంటారో శాస్త్రవాదులకైతే తెలియదు. శివరాత్రి అని అంటారు అయితే ఏ రాత్రి? రాత్రి పూట మనుష్యులు అంధకార వశమై ఎదురుదెబ్బలు తింటూ ఉంటారు. మళ్లీ భక్తి మార్గములో కూడా గంగా స్నానము చేయమని చెప్తుంటారు. అంతేకాక నాలుగు ధామాల యాత్ర చేయండి, ఇది చేయండి అని చెప్తూ ఉంటారు. ఇవన్నీ ఎదురుదెబ్బలు తినడమే కదా. ఇది గాఢాంధకారమైన రాత్రి. సత్య-త్రేతా యుగాలు పగలు. సత్యయుగములో సుఖముంటుంది. అచ్చట పరమాత్మను స్మృతి చేసే పనే ఉండదు. దు:ఖములో అందరూ స్మరిస్తారని అంటారు కదా. భక్తులు తండ్రిని స్మృతి చేస్తారు, సాధన చేస్తూ ఉంటారు. అందువలన వారంతా పతితులే కదా. పతితమని భారత ఖండమునే అంటారు. ఎందుకంటే ఒకప్పుడు భారత ఖండమే పవిత్రముగా ఉండేది. దేవీ దేవతా ధర్మమున్నప్పుడు పవిత్రాత్మలు ఉండేవారు. సత్యయుగములో ఏ ఇతర ధర్మాలు ఉండవు. ఇతర ధర్మాలలోని పతిత ఆత్మలు ఆ సమయములో శిక్షలను అనుభవించి పవిత్రమై పరంధామములో ఉంటారు. వారు సత్యయుగములోకి రారు. సత్యయుగములో సుఖము, శాంతి, సంపద అన్నియు సమృద్ధిగా ఉండేది. అచ్చట ప్రాలబ్ధాన్ని అనుభవిస్తారు.

ఇచ్చట పిల్లలైన మీ అందరిదీ ఒకే మతము. బయటి ప్రపంచములో ఒక ఇంట్లోనే అనేక మతాలుంటాయి. తండ్రి విఘ్నేశ్వరున్ని స్మృతి చేస్తే కుమారుడు హనుమంతుని స్మృతి చేస్తాడు అనగా ఒకే ఇంట్లో అనేక మతాలున్నట్లే కదా. ఇచ్చట పిల్లలైన మీకు తండ్రి నుండి వారసత్వము లభిస్తుంది. సాధారణంగా ఎవరినైనా బాబా అని అంటారు. గాంధీని కూడా బాపూజీ అని పిలిచేవారు కాని గాంధీ అందరికీ తండ్రి కాడు. వీరు అనంతమైన తండ్రి ఆ తండ్రి వచ్చి మనలను సంకెళ్ళ నుండి విడిపిస్తారు. భక్తిమార్గపు సంకెళ్ళు కూడా ఉన్నాయి. మేము పతితులుగా ఉన్నామని అర్థమే చేసుకోరు. పతితులను పావనముగా చేసేవారు ఒక్క తండ్రి మాత్రమే. మీరు ఒక్క సత్యమైన తండ్రిని మాత్రమే నమ్ముతారు. ఇతర సత్సంగాలోకి వెళ్తే ఎవరు రావద్దని చెప్పరు. కాని ఇక్కడకు అందరూ రావడం నిషిద్ధము. ఎంతవరకు తండ్రిని తెలుసుకోరో అంతవరకు క్లాసులో కూర్చోరాదు. ఎందుకంటే ఎంత వరకు స్మృతి ఉండదో అంతవరకు అర్హులు కారు. మాయ అనర్హులుగా చేసేస్తుంది. నిర్గుణుడైన నాలో ఏ గుణమూ లేదు. ఈ పాట అందరూ పాడుతుంటారు అనగా అందరూ పతితులనే కదా. బ్రహ్మ, విష్ణు, శంకరులను కూడా అందరూ నిందిస్తారు. కాని దృష్టి ఎలా ఉంటుందో సృష్టి అంతా అలాగే కనిపిస్తుంది. ఇచ్చట కూర్చొని కూడా ఇతరులను స్మృతి చేస్తూ ఉంటే అది వ్యభిచారి స్మృతి అవుతుంది కదా. స్మృతి పూర్తిగా నిలవదు. ఎందుకంటే మాయ బుద్ధియోగాన్ని తెంచేస్తుంది. అయినా బాబా మీకు బుద్ధియోగాన్ని మళ్లీ జోడించడం నేర్పిస్తారు. పోను పోను చివరికి మీ స్మృతి స్థిరంగా నిలుస్తుంది. కనుకనే అతీంద్రియ సుఖము గురించి అడగాలనుకుంటే గోప-గోపికలను అడగండని గాయనముంది. ఈ సంస్థలోని నియమాలు చాలా కఠినంగా ఉన్నందువలన ఇది త్వరగా వృద్ధి

చెందదు. ఎంతవరకు తండ్రిని తెలుసుకోలేరో అంతవరకు క్లాసులో కూర్చోరాదు. క్లాసులో కూర్చునేందుకు అవ్యభిచారి స్మృతి కావాలి. ఇతరులెవ్వరూ సత్యఖండానికి యజమానులుగా తయారు చేయలేరు. మీరు తండ్రి ద్వారా సత్య ఖండానికి మాలికలుగా అవుతారు. ఇప్పుడిది అసత్య ఖండము, అసత్య శరీరము, అసత్యమైన మాయ,.......... అని అంటారు కదా. అర్ధకల్పము అలాగే నడుస్తుంది. తండ్రి జ్ఞానములో నడుస్తూ ఉంటే వారి రచన(పిల్లల)ను కూడా పావనంగా చేయవలసి ఉంటుంది. పిల్లలు పవిత్రంగా అవ్వకుంటే వారిని కుపుత్రులని అంటారు. ఇంట్లో ఒకరు పవిత్రంగా అయ్యి, ఇంకొకరు అవ్వకుంటే జగడాలు, గొడవలు జరుగుతాయి. అందువలన మనుష్యుల హృదయము దు:ఖములో విరిగిపోతుంది. ఇక్కడ వింటున్నప్పుడు మాత్రము బాగుంది - బాగుంది అని అంటారు. మళ్లీ బయటకు వెళ్తూనే ఎలా ఉండేవారు అలాగే ఉండిపోతారు. సన్యాసులైతే గృహస్థ వ్యవహారములో ఉంటూ పవిత్రంగా అవ్వడం అసంభవమని అంటారు. కనుక మేము ఎలా పవిత్రంగా ఉండగలమని భావిస్తారు. కానీ ఇచ్చట ప్రతిజ్ఞ చేయవలసి వస్తుంది. పిల్లలు కూడా మేము పవిత్రముగా అవుతామని అంటారు. ఓ సద్గతిదాతా! రండి అని అర్ధకల్పము మనము పిలుస్తూ వచ్చాము. ఇప్పుడు వారు వచ్చారు. అందువలన ఇప్పుడు వారి మాట వింటారా, ఇతరుల మాట వింటారా? ఒకవేళ మీరు తండ్రి మాట వినకపోతే సత్యయుగములోకి ఎలా రాగలరు? తండ్రికి సంతానంగా అవ్వకుంటే కుపుత్రులే అవుతారు కదా. ఆ తర్వాత ఇచ్చట నిలువలేరు. ఇచ్చట ఉండడం వారికి చాలా కష్టమైపోతుంది. హంసలుగా, కొంగలుగా అయితే కలిసి ఎలా ఉండగలరు? కొన్ని చోట్ల స్త్రీ పవిత్రముగా ఉంటుంది. పతి పవిత్రంగా అవ్వకుంటే స్త్రీ బాధపడుతూ, పిలుస్తూ ఉంటుంది. తండ్రి అంటున్నారు - పిల్లలూ మీరు సహించవలసి ఉంటుంది. వారి నుండి విడిపోయి పని చేసుకొని బ్రతకండి, పాత్రలు తోమండి, మీకు కావలసింది పట్టెడన్నమే(రొట్టెముక్కే) కదా. వికారాల వశము అవ్వడం కంటే అంట్లు తోముకోవడం మంచిదే కదా. ఆడబిడ్డకు లౌకిక తండ్రి కూడా రక్షణ(ఆశ్రయం) ఇవ్వడం లేదు. వికారాల కొరకే కదా మీకు వివాహము చేసింది అని అంటాడు కాని పారలౌకిక తండ్రి - దానము ఇస్తే గ్రహణము విడిపోతుంది అని అంటారు. 5 వికారాలను దానమిస్తే గ్రహణము వదలిపోతుంది. చంద్రుని వలె 16 కళా సంపూర్ణంగా అవుతారు. శ్రీ కృష్ణుడు 16 కళా సంపూర్ణుడు కదా. ఇప్పుడు ఒక్క కళ కూడా లేదు. ఇప్పుడు అందరూ పతితులుగానే ఉన్నారు. మేము పతితులుగానే ఉన్నామని అంటారు. అయితే నరకవాసులని అంటే కోపగించుకుంటారు. ఈ సమయములో యథా రాజా రాణి, తథా ప్రజా అందరూ పతితులుగా ఉన్నారు. సత్యయుగము శ్రేష్ఠాచారి ప్రపంచము, సత్యయుగములో ఎవ్వరూ ఏడ్వరు. అందువలన ఇక్కడ కూడా మీకు విలపించేందుకు(ఏడ్చేందుకు) అనుమతి లేదు. అలా ఏడిస్తే స్థితి బలహీనంగా ఉందని అర్థము. 21 జన్మలకు తండ్రి చక్రవర్తి పదవిని ఇస్తూ ఉంటే ఏడ్చే అవసరమేముంది? అయితే ఈ విషయము మర్చిపోతారు. ఇది రోగీ ప్రపంచము, భోగీ ప్రపంచము. సత్యయుగము నిరోగి, యోగీ ప్రపంచము. అయితే ఇచ్చట తండ్రిని స్మృతి చేయాలి. స్మృతి చేయకుంటే డిస్ సర్వీసు చేస్తారు. ఎందుకంటే వాయుమండలాన్ని పాడు చేస్తారు. ఇచ్చట అందరూ పతితులే. పతితులకు దానము చేయడం వలన పవిత్రంగా అవ్వలేరు. పతితులకు దానము చేస్తే వారు పతిత కర్మలే చేస్తారు. ఇచ్చట పతితులకు పతితులతోనే వ్యవహారముంది. అచ్చట పవిత్రులకు పవిత్రులతోనే వ్యవహారముంటుంది. వ్యభిచారి అనే పదము చెడ్డది కదా. మొదట

భక్తి కూడా అవ్యభిచారిగా ఉండేది. శివుని మాత్రమే పూజించేవారు. తర్వాత దేవతల భక్తి ప్రారంభించారు. అప్పుడు రజో గుణ భక్తి అనబడ్తుంది. ఇప్పుడైతే మనుష్యులను కూడా పూజించడం ప్రారంభించారు. సన్యాసుల పాదాలు కడిగి పాద తీర్థమని సేవిస్తారు. మనుష్యులను పూజించుటను భూతపూజ అని అంటారు అనగా పంచ తత్వాలతో తయారైన శరీరాన్ని పూజించుట. కొద్దిగా కూడా అర్థము చేసుకోరు. అందుకే అంధుల సంతానము అంధులే అని అంటారు. నేత్రవంతుని పిల్లలైన మీరు కూడా నేత్రవంతులే. అంధులైనందున వారు అంధకారములో ఎదురుదెబ్బలు తింటూ ఉంటారు. గురు బ్రహ్మ, గురు విష్ణు, గురు శంకర,............. ఇలా అనడం కూడా తప్పే. విష్ణువు సత్యయుగములో ఉంటారు. అతడు తన ప్రాలబ్ధాన్ని అనుభవిస్తాడు. మిగిలింది గురుబ్రహ్మ. ఇతడు (బ్రహ్మ) కూడా తన శరీరములో తండ్రి వచ్చినప్పుడు మాత్రమే అలా గురువుగా అవుతాడు. ఎంతవరకు తండ్రి రారో, అంతవరకు ఇతడు కూడా దేనికీ పనికి రాడు.

అనంతమైన తండ్రి చెప్తున్నారు - ఎవరైతే నా శ్రీమతాన్ని అనుసరిస్తారో, వారే నాకు సుపుత్రులు. ప్రభుత్వము వారు ఎమర్జెన్సీలో ఎలాగైతే ఆర్డినెన్స్ జారీ చేస్తారో అలాగే పాండవ ప్రభుత్వము(బాబా) కూడా ఆర్డినెన్స్ జారీ చేస్తోంది - పవిత్రంగా తయారైతే పవిత్ర ప్రపంచానికి యజమానులుగా అవుతారు. కావున తండ్రి చెప్తున్నారు - దేహ సహితంగా దేహ సర్వ సంబంధాలను మరిచి నన్ను ఒక్కరినే స్మృతి చేయండి. ఈ శరీరముతో బుద్ధి యోగాన్ని తెంచి ఆత్మకు పరమాత్మతో నిశ్చితార్థము చేయిస్తారు. అందువలన తండ్రిని స్మృతి చేయాలి. శరీరము పై కూడా మమకారము తొలగించాలి. మోహజీత్ రాజు కథ ఉంది కదా. మీరు కూడా మోహజీతులుగా అవ్వాలి. ఇది యుద్ధ మైదానము. ఈ యుద్ధములో ఏ మాత్రము పొరపాటు చేసినా అజాగ్రత్తగా ఉండినా మాయ మింగేస్తుంది. ఏనుగును మొసలి పట్టుకుందని అంటారు. ఏనుగు నీటిలోకి వెళ్లడం, మొసలి పట్టుకోవడం ఇవన్నీ అసాధరణమైన విషయాలు. అటువంటిదేమీ లేదు. ఆ మాటలన్నీ ఇచ్చటివే. మంచి మంచి మహారథులు చాలా మందికి అర్థం కూడా చేయిస్తారు. సెంటర్లను సంభాళించే వారైనా కొంచెము ఏమరుపాటుగా ఉండినా మాయ మింగేస్తుంది. ఎలా మింగుతుందంటే తండ్రి సాంగత్యము నుండే విడిపించి తీసుకు పోతుంది. పాత ప్రపంచములోకి వెళ్లిపోతారు. అందువలన చాలా హెచ్చరికగా జాగురూకతతో ఉండాలి. ఎందుకంటే ఇది మాయతో మల్లయుద్ధము(బాక్సింగ్). ఇవన్నీ చాలా బాగా అర్థము చేసుకోవాల్సిన విషయాలు. కేవలం విన్నదానికంతా సత్యము-సత్యము అని అనడం కాదు. అలా సత్యము - సత్యము(సచ్ సచ్, సత్య వచన్ మహారాజ్) అని భక్తి మార్గములో అంటారు. ఫలానావారు ముక్కు ద్వారా జన్మించారని అంటే అది కూడా సత్యమేనని అంటారు. అవన్నీ భక్తిమార్గములోని విషయాలు. ఇవి జ్ఞాన విషయాలు. వీటిని ధారణ చేయవలసి వస్తుంది. మాయతో యుద్ధము చేయాలి. తండ్రివారిగా అయ్యి ఏదైనా పాపకర్మ చేస్తే ఇంకా నూరు రెట్ల శిక్ష లభిస్తుంది. కావున బాబా చాలా అప్రమత్తము చేస్తున్నారు. ఇప్పుడు బాప్‌దాదా సన్ముఖములో కూర్చొని చదివిస్తున్నారు. ఓ భగవంతుడా! అని మీరు ఇప్పుడు అనరు కదా. శివబాబాకు ఒక్క బ్రహ్మ మాత్రమే కొడుకు. తర్వాత అతడే బ్రహ్మ నుండి విష్ణువుగా అవుతాడు. మంచిది.

మధురాతి మధురమైన అపురూపమైన పిల్లలకు మాత - పిత, బాప్‌దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్‌మార్నింగ్
ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము :-

1. చంద్రుని సమానంగా 16 కళా సంపూర్ణంగా అయ్యేందుకు పంచ వికారాలను పూర్తిగా దానమిచ్చి గ్రహణము నుండి ముక్తమైపోవాలి.

2. తండ్రి వారిగా అయ్యి ఏ పాప కర్మలు చేయరాదు. శరీరము పై కూడా మమకారాన్ని వదిలి మోహజీతులుగా అవ్వాలి.

## వరదానము :- " బ్రాహ్మణ జీవితంలో అభినందనల పాలన ద్వారా సదా వృద్ధిని ప్రాప్తి చేసుకునే పదమాపదమ్ భాగ్యవాన్ భవ "

సంగమ యుగంలో విశేషంగా సంతోషాలతో నిండిన అభినందనలతోనే సర్వ బ్రాహ్మణులు వృద్ధి చెందుతున్నారు. బ్రాహ్మణ జీవితములోని పాలనకు ఆధారము అభినందనలు. తండ్రి స్వరూపంలో ప్రతి సమయములో అభినందనలు, శిక్షకుని రూపంలో ప్రతి సమయములో శభాష్, శభాష్ అనే ప్రశంసలు, గౌరవప్రదంగా ఉత్తీర్ణులుగా చేస్తున్నాయి. సద్గురువు రూపములో ప్రతి శ్రేష్ఠ కర్మకు ఆశీర్వాదాలు సహజమైన ఆనందమయ జీవితాన్ని అనుభవం చేయిస్తున్నాయి. అందువలన మీరు పదమాపదమ్ భాగ్యశాలురు. మీరు భాగ్యవిధాత అయిన భగవంతుని పిల్లలుగా సంపూర్ణ భాగ్యానికి అధికారులుగా అయ్యారు.

## స్లోగన్ :- " సత్యమైన సేవ ద్వారా సర్వుల ఆశీర్వాదాలు ప్రాప్తి చేసుకొనువారే అదృష్టవంతులు "